క్లుప్తంగా

పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలి



పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న సీపీఐ నాయకులు

అల్లిపురం: పట్టణ పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలని, సూపర్ సిక్స్ హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2వ తేదీన మండల కార్యాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ తెలిపారు.
ఈ మేరకు శుక్రవారం అల్లిపురం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శి పి. చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు కె. సత్యాంజనేయ, కె. వనజాక్షి, ఆర్. శ్రీనివాసరావు, ఎం. మన్మథరావు, ఎన్. నాగభూషణం, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదు

మహారాణిపేట: జిల్లాలోని ఆర్‌ఎంపీలు గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు అన్నారు. గర్భిణులకు ఎవరైనా నాటు వైద్యం చేసినా, ఆర్‌ఎంపీలు వైద్యం చేసినా, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రిఫర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పొందడం వల్ల మాతా, శిశు మరణాలను నియంత్రించవచ్చని అన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి..

విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–2002 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం (ఆన్‌లైన్)లో రిజిస్టర్ చేసుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకపోతే అటువంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్ యాజమాన్యాలు http@// clicalesttact. ap. gov. in ద్వారా, స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు https@// pcpndt. ap. gov. in ద్వారా రిజిస్టర్ చేసుకోవలసిందిగా తెలిపారు.

టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ



టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. నగరంలో శాంతి భద్రతలను అదుపులో ఉండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ ఎర్రంనాయుడు, సిబ్బందికి సూచనలు అందజేశారు. సిబ్బంది విధులపై సమీక్షించారు. స్టేషన్‌లో రికార్డులన్నీ సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లు, కేసుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో వారాహి అమ్మవారి ఏకాదశి పూజ



విశేష అలంకరణలో వారాహి మాత

అల్లిపురం: వివేకానందకాలనీలో వెలసిన వారాహి మాత దేవాలయంలో ఏకాదశి పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకుడు రకరకాల పువ్వులతో అలంకరించారు. అమ్మవారికి మహిళలు సామూహికంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముందు చూపు లేకుంటే.. ముప్పే







చెత్తా చెదారంతో నిండిపోయిన కర్రలదొడ్డి (ఫుడ్‌యార్డ్ స్ట్రీట్)

- అవగాహన లోపంతో గల్లీల్లో తాండవిస్తోన్న అపారిశుధ్యం
- దోమల విజృంభణతో ప్రబలుతున్న విషజ్వరాలు
- అవగాహనతోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యం

డాబాగార్డెన్స్: మనిషన్నాక ఎప్పుడో ఒకప్పుడు అనారోగ్యానికి గురవుతాడు. ఏదో ఒక వ్యాధితో బాధపడకా తప్పదు. పిల్లలకు ఈ సమస్యలు మరీ అధికం. పైగా జీవన ప్రమాణాలు కనిష్ట స్థాయిలో ఉండే చోట ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంటుందనడంలో ఆశ్చర్యం లేదు. వ్యాధుల గురించి సామాన్యులకు, పెద్దగా చదువుకోని ప్రజలకు అవగాహన అంతంత మాత్రమే. వ్యాధులపై నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నది మనకు అవగతమే.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఎక్కడ?

స్థానికులకు వినోదాన్ని కలిగిస్తూనే అవగాహన పెంచే కళారూపాలను ఊరూరా పంపి, కార్యక్రమాలపై అవగాహన కల్పించేది గత ప్రభుత్వం. దక్షిణ నియోజకవర్గంలోని పాతపోస్టాఫీస్, అల్లిపురం భీంనగర్, ప్రసాద్‌గార్డెన్స్, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో ఉన్న పబ్లిక్ హెల్త్ సెంటర్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆయా సెంటర్ల ఏఎన్‌ఎంలు, ఆయాల సహకారంతో సదస్సులు నిర్వహించే వారు. సదస్సులతో పాటు మురికివాడల్లోని ప్రజలకు మరింత చేరువయ్యేందుకు బుర్రకథల రూపంలో కళాకారులు సీజనల్‌గా వచ్చే వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలను పాట మాదిరిగానో, కథలాగానో చెప్పేవారు. సీజనల్ వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులపై అవగాహన కల్పించడంతో పాటు పిల్లల్లో ఐదు వ్యాధులను నియంత్రించే పెంటావాలెంట్ వ్యాక్సిన్ ఉపయోగాలను ఆసక్తి కలిగించేలా వివరించేవారు. అన్నీ కథల్లా ఉండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించేవారు. కొంత వరకైనా అవగాహన పెంచుకునేవారు. అయితే ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ సెంటర్ల స్థానంలో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల పేరిట ఈ వైద్యం వచ్చేసరికి ఆరోగ్య శాఖ ప్రజలకు అవగాహన కల్పించే విషయంలో వెనుకడుగు వేస్తోంది.



అపారిశుధ్యం తాండవిస్తున్న పూర్ణామార్కెట్

రాబోయేది వర్షాకాలం..

వర్షాకాలం వస్తోంది. ముందు నుంచే చర్యలు చేపట్టకపోతే వ్యాధుల విజృంభణ తప్పదంటూ సాక్షాత్తు నగర మేయరే సంబంధిత అధికారులు.. జోనల్ కమిషనర్లను అప్రమత్తం చేశారు. వర్షాలు సంభవిస్తే ముంపునకు గురయ్యే ప్రాంతాలను స్వయంగా తానే పరిశీలిస్తానని ఇటీవల జీవీఎంసీలో పబ్లిక్ హెల్త్ విభాగ సమీక్ష సమావేశంలో చెప్పారు. కానీ అవి మాటల వరకే. ఇటు అధికారులు చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అలా అని మేయర్ కూడా ఇంత వరకు మురికివాడ ప్రాంతాల్లో సందర్శించలేదు.

చర్యలు చేపడుతున్నాం..

"సీజనల్ వ్యాధులపై పబ్లిక్‌కు అవగాహన కల్పించే విషయమై చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా మురికివాడ ప్రాంతాల్లో కళాజాతలు, వివిధ రూపాల్లో అవగాహన కల్పించనున్నాం."
– డాక్టర్ నరేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి, జీవీఎంసీ



రామకృష్ణ రైతు మార్కెట్ వద్ద తీసిన సిల్ట్‌ను కుప్పలు పోసి వదిలేసిన దృశ్యం

పూర్ణామార్కెట్ వద్ద ఇలా..

పూర్ణామార్కెట్‌లో సుమారు 200 దుకాణాలు ఆధారపడి ఉన్నాయి. అలాగే మార్కెట్‌కు సమీపంలో పలు నివాస గృహాలు కూడా ఉన్నాయి. వీరంతా పూర్ణామార్కెట్‌కు ఉత్తర భాగాన (కోడిమాంసం, చేపలు విక్రయించే ప్రాంతం వద్ద) ఉంటారు. ఇక్కడే పెద్ద ఎత్తున చెత్త డంప్ చేస్తున్నారు. పారిశుధ్య కార్మికుల లోపం ఏమాత్రం కాదు. ప్రతి రోజూ వారు చెత్త తరలిస్తూనే ఉన్నారు. కానీ ఇటు దుకాణదారులు.. చిరు వ్యాపారుల్లో అవగాహన లోపం కారణంగా ఎప్పటికప్పుడు చెత్త వేసేస్తుండడంతో డంప్‌లా తయారవుతోంది. దుకాణదారులు, చిరువ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

కర్రలదొడ్డి(ఫుడ్‌యార్డ్ స్ట్రీట్)లో ఇలా..

ఈ ప్రాంతంలో నివాసించేది బడుగు బలహీన వర్గాల వారే. ఇది మురికివాడ ప్రాంతం. టౌన్ కొత్తరోడ్డు వద్ద ఉన్న జీవీఎంసీ సూయిజ్ ఫాంకు కూతవేటు దూరంలో ఈ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో సుమారు 300 నుంచి 400 కుటుంబాలు ఉంటున్నాయి. ఇక్కడ కూడా పారిశుధ్య కార్మికుల తప్పు ఏమాత్రం లేదు. అవగాహన లోపం కారణంగా ఇక్కడ నివసిస్తున్న వారే ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలి. మరీ ముఖ్యంగా వర్షపు నీరు నిలిచిపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. వ్యాధులు సంభవించే ప్రమాదం ఉంది.

పేద విద్యార్థి ఫీజుకు వాసుపల్లి ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: పేద విద్యార్థి ఫీజు నిమిత్తం వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. 38వ వార్డుకు చెందిన గీత ఇంటర్‌లో చేరేందుకు వాసుపల్లి రూ.10 వేలు అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి భరోసా ఇస్తున్న రోల్ మోడల్ నాయకుడు, మన జననేత జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు అత్యాశ చూపించి గద్దెనెక్కిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏడాది గడచినప్పటికీ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. ఇటీవల కుంటి సాకులతో కోత విధించి మత్స్యకార భరోసా 50 శాతం మత్స్యకారులకు అందాల్సిన సహాయం ఎగ్గొట్టారని ఆరోపించారు. కనీసం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగ హామీలు గాలికి వదిలేశారన్నారు. గత ప్రభుత్వంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, నూతన ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణం, మెడికల్ కళాశాలల నిర్మాణం చేశారన్నారు. బాబు మహిళలకు ఉచిత బస్సులు అంటూ మోసం చేశారన్నారు. కేవలం అధికార వ్యామోహంతో విశాఖలో మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల కోసం కోట్లాది రూపాయలతో తమ కార్పొరేటర్లతో బేరసారాలు చేసుకున్నారని, అధికారం తప్ప, ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సమస్యలు పట్టని కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వాసుపల్లి హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దశమంతుల మాణిక్యాలరావు, ముజీబ్‌ఖాన్, చింతకాయల వాసు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయండి



టౌన్ కొత్తరోడ్డు వద్ద కల్వర్టు పనులు పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–4 పరిధి 38వ వార్డు టౌన్ కొత్తరోడ్డు వద్ద ఇటు ప్రజలు, అటు రవాణాకు ఇబ్బంది కలగకుండా చేపట్టిన కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ పీలా శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ పట్ల అవగాహన కార్యక్రమాలు చేపడుతూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఘోషాసుపత్రి వద్ద దోమల నిర్మూలనకు మలేరియా విభాగం ఏర్పాటు చేసిన అవగాహన ప్రదర్శనను పరిశీలించారు. అలసత్వంతో విధులు నిర్వర్తిస్తున్న ఒక మలేరియా వర్కర్‌ని విధుల నుంచి తొలగించాలని, మలేరియా ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావుకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని, సహాయ వైద్యాధికారి పర్యటన లోపం స్పష్టంగా కనిపిస్తుందని, సరి చేసుకునేలా చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారిని ఆదేశించారు. అనంతరం టౌన్‌హాల్, వైజాగ్‌పటం క్లబ్, హెచ్‌ఆర్‌డీ సెంటర్, వాటర్ ట్యాంక్ ప్రాంగణాన్ని సందర్శించారు. వన్‌టౌన్ శివాలయం సమీపాన గాంధీ పార్క్ కాంపౌండ్ వాల్‌ను పెంచేందుకు రోడ్డుకు ఇబ్బంది లేకుండా స్థానికులతో చర్చించి అవసరమైతే ప్రతిపాదన అందజేయాలని జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడును ఆదేశించారు. సమీప వీధిలో ఆక్రమిత బడ్డీలను వెంటనే తొలగించాలని ఏసీపీ ఝాన్సీలక్ష్మిని ఆదేశించారు. అనంతరం కనకమహాలక్ష్మి అమ్మవారిని మేయర్ దర్శించుకున్నారు.

ఇళ్లు, భవనాల కొలతల రీసర్వే వెంటనే నిలుపుదల చేయాలి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్‌లీడర్ గంగారావు

డాబాగార్డెన్స్: 20 శాతం ఆస్తి పన్ను పెంపునకు చేపట్టిన ఇళ్లు, భవనాల కొలతల రీసర్వే వెంటనే నిలుపుదల చేయాలని, తక్షణం జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు శుక్రవారం మేయర్ పీలా శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా భవనాల నిర్మాణ (ఇంటి) విస్తీర్ణ కొలతలు తక్కువగా ఉన్నాయంటూ అన్ని పట్టణాలు, నగరాల్లోని నివాస, వాణిజ్య భవనాల రీ సర్వే పేరిట ప్రతి ఇంటి కొలతలు తీసుకోవాలని నిర్ణయించిందన్నారు. 2025 జూన్ 15లోపు ప్రతి ఇంటి కొలతలు సేకరించి, ఆస్తిపన్ను కనీసం 20 శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఇది పూర్తిగా నియంతృత్వ చర్య అని పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.463 కోట్లు, జీవీఎంసీలో ప్రస్తుత ఆస్తి పన్నుపై అదనంగా కనీసం రూ.112 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించారన్నారు. ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం–1955 సెక్షన్ 220ఏ (1) ప్రకారం ఆస్తి పన్ను పెంపు, పెనాల్టీ విధింపుపై నిర్ణయించే అధికారం జీవీఎంసీ కౌన్సిల్‌కే ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ ఆదేశాలు జీవీఎంసీలో అమలు చేయకుండా ప్రజా ప్రతినిధులుగా ఆ బాధ్యత మనపై ఉందని మేయర్‌కు గంగారావు సూచించారు. రీసర్వే జీవీఎంసీలో తిరస్కరించాలని కోరారు.

కొత్త రేషన్ కార్డు దరఖాస్తుదారులకు సూచనలు



దండుబజార్ సచివాలయంలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న డీఎస్‌వో భాస్కరరావు

మహారాణిపేట: సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి వి.భాస్కరరావు శుక్రవారం నగరంలో పలు సచివాలయాలను సందర్శించారు. అక్కడ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారితో మాట్లాడారు.
వారికి సలహాలు, సూచనలు అందజేశారు. రేషన్ కార్డు మంజూరుకు ఏమేం కావాలో అవగాహన కల్పించారు. దండుబజార్ సచివాలయంలో కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసిన వారితో మాట్లాడారు.

ఔత్సాహిక వ్యాపారవేత్తలకు దిశానిర్దేశం



మెగా కొలాబరేషన్ మీట్‌కు హాజరైన సభ్యులు

డాబాగార్డెన్స్: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్‌కి అనుబంధంగా ఏర్పాటైన జెకామ్ మెగా కొలాబరేషన్ మీట్ శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. జేసీఐ జోన్–4 పరిధిలో జరిగిన ఈ సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు వేణు గోపాల్ మాట్లాడుతూ జోన్–4 పరిధిలోకి వచ్చే ఏపీ సభ్యులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. సభ్యత్వ నమోదులో 10 వేల సంఖ్యను అధిగమించడమే తమ లక్ష్యమన్నారు. జేసీ రామ సూర్య మాట్లాడుతూ సభ్యుల్లో వ్యాపారవేత్తలందరూ సమావేశమై వాణిజ్య అభివృద్ధికి తీసుకోవల్సిన సూత్రాలు, మెరుగైన పద్ధతులపై పరస్పరం ఈ జేకామ మెగా కొలాబరేషన్ మీట్‌లో చర్చిస్తామన్నారు. వ్యాపార రంగంలోకి కొత్తగా అడుగు పెట్టేవారికి కూడా దిశా నిర్దేశం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేసీఐ అల్యూమినియం క్లబ్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులతో పాటు జోన్ అధ్యక్షుడు సంతోష్ శివకుమార్, జోన్ మెంటార్ కేవీ రావు, జాతీయ వైస్ చైర్మన్ రాంసూర్య, శివశంకర్, వినీత్‌కుమార్ జైన్, కర్రి స్వామి పాల్గొన్నారు.

విజయదుర్గాలమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి భక్తులు సమర్పించిన సారె

అల్లిపురం: జెండాచెట్టు వాసుల ఆరాధ్య దైవం విజయ దుర్గాలమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, రకరకాల పండ్లు, స్వీట్లతో మహిళలు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. జెండా చెట్టు, అచ్చియ్యమ్మపేట, భూపేష్‌నగర్, యాతపేట, చలువతోట, కెప్టెన్ రామారావు జంక్షన్ తదితర ప్రాంతాల్లో తిరువీధి నిర్వహించి దేవాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం సారెను అమ్మవారికి నివేదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కదిరి గురుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు లింగం శ్రీనివాస్, పుక్కల్ల సత్తిరాజు, యల్లయ్యమ్మ, కుమారి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజారుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

గెస్ట్ ఫ్యాకల్టీలు అవసరమా?

- ఏయూ హెచ్‌వోడీల సమావేశంలో ఇదే చర్చ

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీల అవసరం ఏ మేరకు ఉందనేది మరోమారు చర్చకు దారి తీసింది. ఏయూ క్యాంపస్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులతో శుక్రవారం సమావేశమైన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అంతర్గతంగా జరిగిన సమావేశం కావడంతో వివరాలు గోప్యంగా ఉంచారు. ఈ నెల 28న రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్లతో నిర్వహించే సమావేశానికి సమగ్ర నివేదికలతో హాజరు కావాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఇక్కడి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏయూలో జరిగిన సమావేశానికి ప్రాధాన్యం సంతరించికుంది. వర్సిటీలోని విభాగాల వారీగా పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు లెక్క తీసిన వీసీ రాజశేఖర్ ఒకింత విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విభాగాల్లో ఇంతమంది అవసరమా..? అని ప్రశ్నిస్తూనే.. వారిలో బోధనా నైపుణ్యత ఎంత ఉందనేది తెలుసుకునేందుకు మరోమారు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో అనుభవజ్ఞులను కొనసాగిస్తూనే.. కొత్తగా తీసుకునేందుకు ఎలా ముందుకెళ్లాలనే దానిపై అందరి అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం. ప్రస్తుతం వర్సిటీలోని అన్ని విభాగాల్లో కలిపి సుమారుగా 400 వరకు గెస్ట్ ఫ్యాకల్టీలు పనిచేస్తున్నారు. వీరిలో కొంతమందిని పద్ధతి ప్రకారం కాకుండా హెచ్‌వోడీలు తమకు నచ్చిన రీతిలో నియమించేశారనే ఫిర్యాదులు సైతం ఉన్నాయి. దీనిపై ఫోకస్ పెట్టిన ప్రస్తుత వైస్ చాన్సలర్.. విభాగాల్లో ఎంత మంది అవసరం..? ఎవరిని ఉంచాలి..? ఎవరిని తీసేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో కొంత మంది గెస్ట్ ఫ్యాకల్టీలు అప్పుడే లాబీయింగ్‌లను మొదలుపెట్టారు. వీసీపై ఒత్తిడి తీసుకొచ్చి.. తాము కొనసాగేలా పావులు కదుపుతున్నారు.

నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



పర్యాటకులను రక్షించిన లైఫ్‌గార్డ్స్

డాబాగార్డెన్స్: ఆర్కే బీచ్‌లో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఎనిమిది మంది యువకులు సరదాగా గడిపేందుకు బీచ్‌కు వచ్చారు. వారిలో నలుగురు సముద్రంలో మునిగిపోతూ ఉండగా జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ వెంటనే స్పందించి కాపాడారు. జీవీఎంసీ ఇన్‌చార్జి స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు తెలిపిన వివరాలివి. హైదరాబాద్ నుంచి వచ్చిన షబ్బీర్, అబ్బాస్, ఇద్రిస్, హుస్సేన్ అనే యువకులు శుక్రవారం ఉదయం ఆర్కే బీచ్‌లో స్నానానికి దిగారు. అయితే సముద్ర అలల ఉధృతికి వారు నీటిలో మునిగిపోవడం గమనించిన బీచ్ లైఫ్‌గార్డ్స్ ధనరాజు, నవీన్, ఆనంద్, లక్ష్మణరావు, కేపీ వాసు వెంటనే రంగంలోకి దిగారు. నలుగురు యువకులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం వారికి ప్రథమ చికిత్స అందించారు. ఆ తర్వాత వారిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం వారిని పంపించివేశారు.

నేడు యోగా ఈవెంట్

మహారాణిపేట: యోగాంధ్ర వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులోని శాశ్వత వేదిక వద్ద జిల్లా స్థాయి యోగా ఈవెంట్ జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఈవెంట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు.

వారానికి ఒక రోజు డ్రై డే పాటించండి

సీతంపేట: వారం రోజులు పైబడి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే అమలు తీరును పరిశీలించారు. ఏఎన్‌ఎం అప్పలనరసతో ఇంటింటికి వెళ్లి సెటి నిల్వలను పరిశీలించారు. కుండీలు, డ్రమ్ముల్లో లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించి, ఆ నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు భారంగా ప్రైవేటు వైద్యం

- సీఎంకు ఈఏఎస్ శర్మ లేఖ

మహారాణిపేట: ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్‌లు చార్జ్ చేస్తున్న ఫీజులు భరించలేక పేద ప్రజలు అప్పులపాలవుతున్నారని, అటువంటి ప్రైవేట్ సంస్థలపై కఠినమైన నియంత్రణ అవసరమని కేంద్ర ప్రభుత్వ విశ్రాంత కార్యదర్శి ఈఏఎస్ శర్మ అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం శర్మ లేఖ రాశారు. ప్రభుత్వ రంగంలో ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలు, శిక్షణ సంస్థలను స్థాపించే దిశలో కావాల్సిన నిధులను రాష్ట్రప్రభుత్వం కేటాయించాలని కోరారు. కేజీహెచ్ విషయంలో గత నెల 24న ఒక లేఖ రాశానని గుర్తు చేశారు. అక్కడి వైద్యులు సామాజిక స్పృహతో సేవలందిస్తున్నప్పటికీ.. సౌకర్యాలు లేకపోవడం కారణంగా ఆసుపత్రి ప్రాంగణంలో రద్దీ ఉంటోందన్నారు. దీని వల్ల రోగులు, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని అందులో ప్రస్తావించినట్లు చెప్పారు. పేద ప్రజలు.. ప్రైవేటు ఆసుపత్రులు వసూలు చేసే ఫీజులు, ఇతర ఖర్చులను భరించలేరన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు ప్రైవేటు ఆసుపత్రులలో ఉచితంగా సౌకర్యాలు లభించే అవకాశం ఉన్నా.. ప్రైవేటు ఆసుపత్రుల్లో అదనంగా ఉండే ఖర్చులు భరించాల్సి వస్తోందన్నారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న పేద ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యాలు అందించడం లేదని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.